క్లుప్తంగా

ఆలయంలో నాయకుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆల్యానాయక్‌తండా, తాట్లవాయి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ధర్మాజీపేట శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆల్యానాయక్ సర్పంచ్ నందునాయక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి దాతల విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి దాతలు రూ.15 వేల విరాళం అందించారు. జగిత్యాల విద్యానగర్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని గోవర్ధన నాగమణి, తన భర్త రాములు జ్ఞాపకార్థం రూ 10 వేలు, కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన వ్యాపారి దారం రవీందర్, తన సతీమణి సుదారాణి జ్ఞాపకార్థం రూ 5 వేలు ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎల్ల గంగారాజం, ఆశ్రమ నిర్వహణ కార్యదర్శి కనక తార, ఆశ్రమ సభ్యులు బాపురెడ్డి, సత్తయ్య, సుదర్శన్, లక్ష్మణ్, డాక్టర్ గోవర్ధన సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న గోసంగి యువకులు

రాయికల్: పట్టణంలో గోసంగి యువజన సంఘం ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా ఆదివారం 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న రాము, మురళీ, పైలెట్స్ మల్లారెడ్డి, వేణును గోసంగి సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోసంగి యువజన సంఘం నాయకులు గంగరాజం, భూమేశ్, రమేశ్, వెంకటేశ్, వినోద్, వినయ్, మహేశ్, రాజేశం, ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఐ పర్యవేక్షణ

కథలాపూర్: ఎన్నికల వేళ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలను తెలుసుకునేందుకు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం కథలాపూర్ మండలంలో పర్యవేక్షించారు. గత ఎన్నికలప్పటి పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలన



ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట, వెంకటాపూర్, మాదాపూర్, ఐలాపూర్ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను కోరుట్ల నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజీవ్ రంజన్ మీనా, డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.పోలింగ్ కేంద్రాల్లో కల్పించే వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సారంగాపూర్ మండలంలో..

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సెక్టార్ అధికారులు కరుణాకర్, రాధకృష్ణ సోమవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. లక్ష్మీదేవిపల్లి, సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాగునూర్, లచ్చక్కపేట, రంగపేట, రేచపల్లి గ్రామాల్లోని 17 పోలింగ్ బూత్‌ను పరిశీలించి, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

భయం భయంగా ప్రయాణం

- జగిత్యాల – బీర్‌పూర్ ప్రధాన రహదారిపై భద్రత కరువు
- లక్ష్మీదేవిపల్లి ఊరకుంట వద్ద సేఫ్టీవాల్స్ లేని వైనం
- నిధులు మంజూరైన పనుల జాడలేదు



జగిత్యాల-సారంగాపూర్-బీర్‌పూర్ ప్రధానరహదారిపై సేఫ్టీ వాల్స్ లేని కుంట

సారంగాపూర్: ప్రధాన రహదారిపై ప్రయాణికులకు భద్రత కరువైంది. జగిత్యాల జిల్లా కేంద్రానికి నిర్మల్ జిల్లా జన్నారం, కడెం మండలాలతో పాటు, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ఇదే రోడ్డుపై తిరిగి వాహనాలు వెనుదిరుగుతాయి. జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి గోదావరి కమ్మునూర్ వంతెన మీదుగా జన్నారం, కడెం మండలాలకు వాహనాలు చేరడానికి 90 శాతం వరకు డబుల్‌రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసింది. ఈ రోడ్డుపై లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో ఊరకుంట ఉంది. ఈ కుంట వద్ద సేఫ్టీవాల్స్ లేక ప్రమాదకరంగా ఉంది.

లక్ష్మీదేవిపల్లి ఊరకుంట

జిల్లా కేంద్రానికి 11 కిలోమీటర్ల దూరంలో లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని ఆనుకుని ఊరకుంట ఉంది. గతంలో ఈ కుంట చిన్నగా ఉండగా, మిషన్ కాకతీయ కింద కుంటను అభివృద్ధి చేశారు. కుంటలోకి వర్షాలకు వచ్చే నీటితో పాటు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డీ-53 ప్రధాన కాలువ నుంచి నీరు కుంటలోకి చేరుతుంది. కుంటలోతు దాదాపు 50 మీటర్లకు పైగా ఉంటుంది.

సేఫ్టీ బారికేడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు

కుంట పూర్తిగా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని ఆనుకుని ఉంది. వాహనదారులు ఏమరుపాటుగా వ్యవహరిస్తే వాహనాలు కుంటలో పడిపోయే ప్రమాదం ఉంది. కుంట వద్ద రోడ్డు చాచా కోతకు గురికావడంతో కుంట వెంట ఏకకాలంలో రోడ్డుపై ఎదురురెదురుగా రెండు వాహనాలు వస్తే ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంది. దీనిని గుర్తించిన ఆర్‌అండ్‌బీ శాఖ ఇనుప బారికేడ్లు లేదా సిమెంట్‌తో సేఫ్టీవాల్స్ నిర్మించాలని యోచించింది. దీనికోసం నాలుగేళ్ల క్రితం రూ. 3.50 లక్షలు మంజూరు చేసింది. పనుల కోసం టెండర్లు పిలిచారు. టెండర్లు పొందిన కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో అధికారులు టెండర్ పొందిన వ్యక్తి కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. దీంతో నాలుగేళ్లుగా సేఫ్టీవాల్స్ నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని కుంట వద్ద సేఫ్టీ వాల్స్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువచ్చాం. దీనిపై అధికారులు స్పందించడం ఆలస్యం జరిగితే భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. ఎన్నికలు పూర్తికాగానే పనులు ప్రారంభించాలి.

– శ్రీధర్, లక్ష్మీదేవిపల్లి

టెండర్ పిలుస్తాం



లక్ష్మీదేవిపల్లి కుంట వద్ద సేఫ్టీవాల్స్ నిర్మాణం కోసం టెండర్ పొందిన వ్యక్తి పనులు చేయకపోవడంతో ఆయన టెండర్‌ను రద్దు చేశాం. మళ్లీ టెండర్ నిర్వహించడానికి ప్రక్రియ చేపట్టాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ప్రక్రియ నిలిచింది. ఎన్నికల తరువాత టెండర్లు పూర్తి చేసి వేసవిలో పనులు పూర్తి చేస్తాం.

– రాజశేఖర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

దీపావళి వేడుకలు

- ఇంటింటా ధనలక్ష్మీ పూజలు, కేదారీశ్వర నోములు



పెగడపల్లిలో టపాసులు కాల్చుతున్న మహిళలు



ధర్మపురిలో చిన్నారుల సంబురాలు



జగిత్యాలలో దీపాలు వెలిగిస్తున్న యువతి

జగిత్యాలటౌన్: జిల్లాలో దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దీపావళిని పురస్కరించుకుని ఇంటి లోగిళ్లను దీపాలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దుకున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఆది,సోమవారాలు దీపావళి ప్రత్యేక పూజలు, కేదారేశ్వర వ్రతాలు జరుపుకోగా, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజలు నిర్వహించుకున్నారు. టపాసుల శబ్దాలు, యువతీ,యువకులు, చిన్నారుల సంబరాలతో వీధులన్నీ మార్మోగాయి.

పెగడపల్లి:మండలంలో ఆదివారం జరిగిన దీపావళి పండుగ శోభతో పల్లెలన్నీ కళకళలాడాయి. గ్రామాల్లో పండుగ సంతోషం వెల్లి విరిసింది. ఇళ్లు, దుకాణాలను మామిడి తోరణాలు, బంతిపూలు, రంగు రంగుల దీపాలతో అలకంకరించారు. ఇళ్లలో కేదారీశ్వర వ్రతాలు, దుకాణాల్లో ధనలక్ష్మీపూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో ఆదివారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్యంగా వ్యాపార, కిరాణ, ఇతర దుకాణాల నిర్వాహకులు అర్చకులతో లక్ష్మీ పూజలు నిర్వహించారు. యువకులు, చిన్నారులు బాణసంచాను కాలుస్తూ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

రోడ్డుపైనే సంత

- కాలి నడక కూడా కష్టమే
- వినియోగదారుల ఇబ్బందులు



ధర్మపురిలో ప్రధార రహదారిపై కిక్కిరిసిన రోడ్డు

ధర్మపురి: ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. పట్టణంలో ప్రతీ శనివారం రోడ్డు పైనే సంత నిర్వహిస్తుండడంతో వినియోగదారులు, పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒకవైపు వాహనాల పార్కింగ్, మరోవైపు పండ్లబండ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సంత సరైన ఏర్పాట్లు లేక పోవడంతో కాలి నడక కూడా కష్టంగా మారింది. విక్రయ దారులు రోడ్లపై పండ్లబండ్లు, వెంట తెచ్చుకున్న వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. రోడ్లపైన ఇష్టానుసారంగా వాహనాలు పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వార సంత బస్టాండ్ నుంచి నంది కూడలి వరకు, నంది నుంచి చింతామణి చెరువు కట్ట చివరి వరకు కిక్కిరిసి పోతోంది. అత్యవసర సమయంలో అంబులెన్సు వచ్చినా కదిలే పరిస్థితి లేదు. వాహన పార్కింగుల కోసం రుసుం వసూలు చేస్తున్నప్పటికీ బల్దియా అధికారులు సరైన స్థలం చూపించక పోవడంతో రోడ్లపైనే నిలిపే పరిస్థితులున్నాయి. సంతలో మున్సిపల్ అధికారులు, పోలీసులు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను వివరణ కోరగా ప్రతి శనివారం రద్దీ ఎక్కువగా ఉంటుందని, రోడ్డుపై వాహనాలు నిలిపే వారిపై పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటామని, రైతుల కోసం నిర్మించిన సమీకృత మార్కెట్‌లో కూర్చోలేక రోడ్ల పైకి రావడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో సోమవారం అనారోగ్యంతో ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య (55) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, వార్డుసభ్యులు తిరుపతి, గంగారెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియలకు రూ. 10 వేలు అందించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

మేడిపల్లి: మండలంలోని గోవిందారం లో కొనుగోలు కేంద్రం ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.వరి కోతలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో కేంద్రంలో ధాన్యం పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని రైతులు కోరారు.

కాళోజీ అడుగు జాడల్లో నడుచుకోవాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

జగిత్యాల: కాళోజీ అడుగుజాడల్లో నడుచుకోవాలని పెన్షనర్స్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం పెన్షనర్స్ కార్యాలయంలో ప్రజా కవి కాళోజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టుక, చావు తెలంగాణ సాధనకే అంకితం అంటూ కాళోజీ మాట్లాడిన మాటలు అందరికీ గుర్తున్నాయని, అతని అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో బొల్లం విజయ్, విశ్వనాథం, కరుణ, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

జిల్లా ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలిగా కళ్యాణి



కళ్యాణి

కోరుట్ల: ముదిరాజ్ సంఘం జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కోరుట్ల మాజీ కౌన్సిలర్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రెంజర్ల కళ్యాణిని నియమిస్తూ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రెంజర్ల నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు నీలం పెద్దులు, బత్తిని మహేశ్, అల్లూరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ పీజీటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం



మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గెస్ట్ పీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ.అలీమొద్దిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు జీవశాస్త్రం బోధించుటకు పీజీటీ(బోటనీ) పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన (హావర్లీ బేసెడ్) పనిచేయుటకు ఆసక్తి గల నిరుద్యోగులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలతో పాటు టెట్ అర్హత పొందిన అభ్యర్థులు మోడల్ స్కూల్‌లో గెస్ట్ పోస్టులకు రేపటి(ఈ నెల 15)లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ 9849618625 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సేవ చేసేవారికి అవకాశమివ్వాలి

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఈ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని దూలూర్, బొమ్మెన, సిరికొండ, రాజారాం తండా గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులతో ప్రచారం చేశారు. బొమ్మెనలో ముదిరాజ్ సంఘం, గౌడ సంఘం సభ్యులు మద్దతు ప్రకటించి పార్టీలో చేరారు. రాజారాం తండాలో 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఇన్నేళ్లు మీ కష్టాల్లో, సుఖాల్లో తోడుగా ఉన్నవాన్ని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, ఎంపీటీసీ బాదినేని రమేశ్, నాయకులు రాజు, ఎం.డీ హఫీజ్, పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



ముత్యంపేటలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ధర్మపురి: అనుమతి లేకుండా బెల్టు దుకాణాల నిర్వహణ, గుడుంబా, నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ముత్యం అన్నారు. ధర్మపురి ఎక్సైజ్ పరిధిలోని పలు మండలాల్లో బెల్టు దుకాణాలు, గుడుంబా, నాటుసారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 103 కేసులు నమోదు చేసి, 20 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 44,345 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 991 లీటర్ల నాటుసారా, 6 ద్విచక్రవాహనాలు, 63 మద్యం బాటిళ్లు, 53 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం, సామగ్రి విలువ రూ.52 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ సిరికొండ అశోక్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై ఆదివారం రాత్రి ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్‌షాప్ నిర్వాహకుడి వద్ద రూ.10 వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాదవులను అవమానించిన వారికి గుణపాఠం



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యే టికెట్ విషయంలో యాదవ కులానికి చెందిన ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమను అవమానపరిచిన వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పుతామని మండల యాదవ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో యాదవ సంఘం సభ్యులు సమావేశమై మాట్లాడారు. దొర కోసం బీసీకి చెందిన తుల ఉమను బలి పశువు చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే టికెట్ తుల ఉమకు కేటాయించి బీ ఫాం వేరేవారికి ఇవ్వడం దారుణమన్నారు. సమావేశంలో యాదవ సంఘం మండలాధ్యక్షుడు మ్యాదరవేని ఆశన్న, నాయకులు దానవేని మల్లేశ్, తొట్ల అంజయ్య, దేశవేని మహేందర్, గంట భూమన్న, రెబ్బాస్ శంకర్, సబ్బని సతీశ్, కుంభం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గొల్ల కుర్మల మద్దతు ఉండదు

మేడిపల్లి: బీసీ ఆడ బిడ్డ తుల ఉమను బీజేపీ నాయకులు నమ్మించి గొంతు కోశారని, బీమారం మండల యాదవ సంఘం అధ్యక్షుడు రెబ్బాస్ మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ఉమకు వేములవాడ టికెట్ ప్రకటించి, నామినేషన్ సమయానికి బీఫాం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఇది కేవలం తుల ఉమకు జరిగిన అవమానం కాదని, యావత్ గొల్ల, కురుమలకు జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గొల్ల, కురుమలు బీజేపీ కి ఓటు వేయొద్దని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు తాలుక గంగారాం, దండిగపు మోహన్, ప్రధాన కార్యదర్శి బొడ్డు బక్కన్న, రాజేశం, మల్లయ్య, పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి సత్యనారాయణ కృషి



సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి మండల అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ సేవలు ఘనమైనవని ఆ సంఘం మండల ప్రతినిధులు అన్నారు. సంఘం కోసం పోరాటం చేసి జైలుకు వెళ్లి విడుదలై వచ్చిన సత్యనారాయణకు సిరికొండ వద్ద మండల నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంఘం సభ్యులు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల సంఘం ప్రతినిధులు గాండ్ల స్వామి, సత్యనారాయణ, ఆకుల నర్సయ్య, గాండ్ల మోహన్‌రెడ్డి, నీలి భూమరెడ్డి, గాజ ప్రభాకర్, వంచె రాజు, ఆకుల గంగారెడ్డి, చుక్క రాజం పాల్గొన్నారు.